## ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి

### మహారాష్ట్ర రాష్ట్రం గడ్చిరోలి జిల్లాలో ఘటన

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 23 : భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందిన ఘటన ఛత్తీస్ గఢ్–మహారాష్ట్ర రాష్ట్రాల సరిహద్దు గడ్చిరోలి జిల్లాలో శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గడ్చిరోలి జిల్లా ఖవాండే–నెల్గుండ ఇంద్రావతి నదీ పరీవాహక ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సీఆర్పీఎఫ్ భద్రతా దళాలు, 300 మంది సీ–60 కమాండర్లు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులు జరపడంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు ఎదురుకాల్పులు ప్రారంభించాయి. కాల్పుల వేగం పెంచుతూనే ఆ ప్రాంతాన్ని జవాన్లు చుట్టుముట్టారు. దీనిని గ్రహించిన మావోయిస్టులు జవాన్లపైకి కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఎదురుకాల్పుల్లో మృతిచెందిన నలుగురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు ఒక సెల్ఫ్ లోడింగ్ ఆటోమెటిక్ రైఫిల్, రెండు 303 రైఫిళ్లు, ఒక బర్మార్ తుపాకి, వాకీటాకీలు, క్యాంపింగ్ సామగ్రి, నక్సల్స్ సాహిత్యం వంటి ఇతరత్రా వస్తువులను జవాన్లు ఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్నారు.

## కాకతీయ టయోటా షోరూం ప్రారంభం

షోరూం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి, మే 23 : కొత్తగూడెం పట్టణంలోని జాతీయ రహదారిలో రాయల్ ఫర్నీచర్ పక్కన విద్యానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కాకతీయ టయోటా కారు షోరూంను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ పట్టణ ప్రజలకు నూతన షోరూం ద్వారా అతి తక్కువ ధరలకు కార్లను అందించాలనే దృక్పథంతో జిల్లా కేంద్రంలో షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈఎంఐ పద్ధతిలో కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించడం బాగుందని అన్నారు. కార్యక్రమంలో షోరూం ప్రతినిధులు, కస్టమర్లు, ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానను సందర్శించిన డీఎంహెచ్‌వో

సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 23: మున్సిపాలిటీ పరిధిలోని చిట్టిరామవరం బస్తీ దవాఖానాను పాత కొత్తగూడెంలోని ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ శుక్రవారం సందర్శించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఓపీ సేవలు ఎలా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసరమైన మందులు అన్ని వేళలు అందుబాటులో ఉంచాలని అన్నారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహించాలని, సిబ్బంది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. డీఎంహెచ్‌వో వెంట డాక్టర్ రాకేష్, డాక్టర్ అజయ్, పాయం శ్రీనివాస్, హెచ్ఈవో రాంప్రసాద్, బస్తీ దవాఖానా సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలకు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ రూరల్, మే 23: రాజీవ్ వికాస్, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కోసం అర్హులైన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, పేదలకు అన్యాయం జరిగితే అధికారులదే బాధ్యత అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని పనుకుల, పుల్లాయిగూడెం, కొడిపుంజులవాగు, కిన్నెరసాని పంచాయతీల్లో రూ.2.62 కొట్లతో జరుగనున్న రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. పునుకులలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరిగే అభివృద్ధి పనులతో దీర్ఘ కాలంగా ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. గడప గడపకు ప్రభుత్వ పథకాలు అందించాలన్న లక్ష్యంతో తాను పనిచేస్తున్నానని, పేదలకు అన్యాయం జరిగితే సహించేదిలేదని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, అధికారులు రామకృష్ణ, రాణి, నాయకులు సాబిర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, ఎర్రంశెట్టి ముత్తయ్య, కనగాల అనంతరాములు, రాహుల్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
టెలికాలర్స్ కావలెను
★ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు మంచి వాక్ చాతుర్యం కలిగిన మహిళ టెలికాలర్ కావలెను. జీతం : 10,000/- నుండి 20,000/-వరకు ఇవ్వబడును. సంప్ర: 8297529999
KMM-
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## నగర పరిశుభ్రత మనందరి బాధ్యత

ఖమ్మం, మే 23 : అభివృద్ధిలో ముందంజలో ఉన్న ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మంత్రి, మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 2వ డివిజన్‌లోని పాండురంగాపురంలో పర్యటించి కోటి రూపాయలతో నిర్మించనున్న డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ నగర అభివృద్ధి పనులు గ్రౌండింగ్ కావాలని, ప్రభుత్వ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. రాయల నాగేశ్వరరావు, దొండపాటి వెంకటేశ్వరరావు, మేయర్ నీరజ, ఆర్డీవో నర్సింహారావు, కార్పొరేటరు, అధికారులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# యూరియాతో భారం..ఎరువులతో భూసారం

మాట్లాడుతున్న లక్ష్మీనారాయణమ్మ

టేకులపల్లి, మే 23: యూరియా వాడకంతో భూసారం దెబ్బతినడంతోపాటు సాగు ఖర్చు కూడా పెరుగుతుందని జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ అన్నారు. యూరియాకు బదులుగా సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుందని, సాగు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. మండలంలోని కోయగూడెం రైతు క్లస్టర్‌లో శుక్రవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' నిర్వహించారు. రైతు వేదికలో రైతులతో సమావేశమయ్యారు. లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ.. పచ్చి రొట్ట పంటలైన జనుము, జీలుగు, పిల్లిపెసరను భూమిలో కలియదున్నితే భూసారం పెరుగుతుందని, నత్రజని వాడకాన్ని 30 శాతం వరకు తగ్గించుకోవచ్చని చెప్పారు. మునగ, పామాయిల్, వెదురు సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన వన శాస్త్రవేత్త సుధ, ఇల్లెందు ఏడీఏ లాల్‌చంద్, ఏవో అన్నపూర్ణ, హెచ్‌వో స్రవంతి, ఏఈవో శ్రావణి, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎరువుల యాజమాన్యంతో ఖర్చు తక్కువ

దమ్మపేట రూరల్, మే 23: భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యంతో సాగు ఖర్చు తగ్గుతుందని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీలత, డాక్టర్ నాగ అంజలి అన్నారు. మండలంలోని ముష్టిబండ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం 'రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా మందులు వినియోగిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు యాజమాన్య పద్ధతులను వివరించారు. ఉద్యానవన అధికారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### యూరియా వినియోగాన్ని తగ్గించండి

అశ్వారావుపేట, మే 23: పంటల సాగులో రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ పావని, డాక్టర్ కృష్ణతేజ కోరారు. సేంద్రియ సాగుతో పెట్టుబడి భారం తగ్గుతుందని, దిగుబడి బాగుంటుందని చెప్పారు. మండలంలోని అల్లిగూడెం గ్రామంలో శుక్రవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పంట మార్పిడితో సుస్థిర ఆదాయం పొందవచ్చని అన్నారు. రసాయనాల వాడకాన్ని తగ్గించడం ద్వారా నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత రైతులపై ఉందని అన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొని రసీదులు తీసుకోవాలని చెప్పారు. ఏవో శివరాం ప్రసాద్, ఏఈవోలు పాల్గొన్నారు.

## బంగారం షాపులో చోరీ

సీసీ కెమెరాలో నమోదైన నిందితుడు

మణుగూరు టౌన్, మే 23: మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద మసీద్ సమీపంలోని శ్రీవారి జ్యూయలరీస్ షాపులో బంగారపు ఆభరణాలు చోరీ అయ్యాయి. షాపు యాజమాని ఫిర్యాదుతో కేసు నమోదైంది. మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్సై మేడా ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. షాపులోని సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితుడిగా భావిస్తున్న వ్యక్తి ఫొటోను మీడియాకు విడుదల చేశారు. ఈ వ్యక్తిని గుర్తించిన వారు 87126 82091, 87126 82097 సెల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు

పాల్వంచ, మే 23: పాల్వంచలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు అవకతవకలు జరుగుతున్నాయని టీడీపీ రాష్ట్ర నాయకుడు కనగాల అనంతరాములు ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు కొందరు మున్సిపాలిటీలోని కొన్ని ప్రాంతాల్లో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ డబ్బులు వసూళ్లు చేసుకొని ఇళ్లు ఇప్పిస్తున్నారని ఆరోపించారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వ్యక్తులకు, విలాసవంతమైన కార్లు, విలువైన భూములు ఉన్న వారికి ఇందిరమ్మ కమిటీల సభ్యులు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ నాయకులు జరపన సీతారాంబాబు, సుధాకర్, బత్తిన దుర్గారావు గౌడ్, రేగళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చేసిన అటవీ అధికారులు

లక్ష్మీదేవిపల్లి, మే 23: మండలంలోని లోతువాగు, మోకాళ్లగుంపు సమీపంలోని అక్రమ నిర్మాణాలను అటవీ డివిజనల్ అధికారి ఆదేశాలతో శుక్రవారం ఫారెస్టు సిబ్బంది కూల్చివేశారు. గతంలో అధికారులు నోటీసు ఇచ్చిన నోటీసులను లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలు జరుపుతున్నారు. సర్వే నంబర్ 17 ఫారెస్టు పరిధిలో ఉండటం, కొందరు ఇక్కడ భూములను కొనుగోలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఫారెస్టు పరిధిలో ఉన్న భూముల్లో ఎవరైనా ఇంటి నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీవో కోటేశ్వరరావు హెచ్చరించారు. ఫారెస్టు భూముల్లో స్థలాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, డీఆర్‌వో వెంకటేశ్వరరావు, బీట్ ఆఫీసర్ భావ్‌సింగ్, సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి లారీలు నడిపితే కఠిన చర్యలు

చుంచుపల్లి: మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్, భద్రాచలం: మాట్లాడుతున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

చుంచుపల్లి/కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 23: లారీ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు టూటౌన్ పరిధిలోని త్రీ ఇంక్లైన్ లారీ యూనియన్ ఆఫీస్ ప్రాంగణంలో శుక్రవారం లారీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ బాధ్యతగా మెలగాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపకూడదని, నిద్రలేమితో వాహనాలను నడిపితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ కరుణాకర్, టూటౌన్ ఎస్సై కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

### వాహనాలకు ఫిట్‌నెస్ లేకపోతే చర్యలు

భద్రాచలం, మే 23: స్కూల్, కాలేజ్ వాహనాలకు పిట్‌నెస్ లేకపోతే చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) సంగం వెంకటపుల్లయ్య హెచ్చరించారు. నూతన విద్యాసంవత్సరం త్వరలో ప్రారంభమవనున్న నేపథ్యంలో ఆయన శుక్రవారం ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో భద్రాచలంలోని మారుతి పారామెడికల్ కళాశాలలో సమావేశమయ్యారు. స్కూల్/కాలేజ్ బస్సులు/వ్యాన్లకు ఫిట్‌నెస్‌తోపాటు అన్ని గుర్తింపు పత్రాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉండాలని చెప్పారు. ఇవి లోపిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాకపోకలు సాగించేప్పుడు డ్రైవర్లు, క్లీనర్లు జాగ్రత్తలు పాటించకపోతే వారిపై కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# కాంగ్రెస్‌లో దొంగలున్నారు

- రాజకీయ కోవర్టులుగా మారి పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారు
- కొత్తగూడెంలో టీపీసీసీ సభ్యుడు బేబీ శౌరి ఘాటు వ్యాఖ్యలు

మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు, కొత్తగూడెం నియోజకవర్గ కన్వీనర్ జేబీ శౌరి

కొత్తగూడెం అర్బన్, మే 23: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భావజాలానికి సంబంధం లేని వ్యక్తులు కొంతమంది దొంగల మాదిరిగా చేరారని టీపీసీసీ సభ్యుడు, కొత్తగూడెం నియోజకవర్గ కన్వీనర్ జేబీ శౌరి ఆరోపించారు. చెదపురుగుల మాదిరిగా ఒక రాజకీయ పార్టీకి కోవర్టుగా మారి పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21న పరిశీలకులుగా వచ్చిన పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రావణ్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రమోద్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య కొత్తగూడెంలో సమావేశం ఏర్పాటు చేస్తే కొంతమంది సంబంధం లేని వ్యక్తులు రసాభాస చేసి గొడవలు సృష్టించారని విమర్శించారు. అత్యున్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు, క్రమశిక్షణ లేకుండా పార్టీ పరువు తీసే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ విషయం అధిష్ఠానం దృష్టికి వెళ్లిందన్నారు. పార్టీలో అలజడి సృష్టించిన వారిని ఉపేక్షించకుండా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా హైకమాండ్‌ను కోరారు. కాంగ్రెస్ పార్టీ భావజాలాన్ని, సిద్ధాంతాన్ని అర్థం చేసుకునే వారు మాత్రమే పార్టీ కోసం పనిచేస్తారని అన్నారు. పూటకో పార్టీ మారేవారు, ఇప్పటికే నాలుగు పార్టీలు మారిన వ్యక్తి అనుచరులు, అధికారం ఎక్కడ ఉంటే అక్కడ ఉండే బినామీ కాంట్రాక్టర్లు పార్టీకి అవసరం లేదని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో అజ్మీరా సురేశ్‌నాయక్, భిక్షపతి, తెలకపల్లి లక్ష్మయ్య, దావూద్, ఎలకపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామయ్యకు స్వర్ణ కవచాలంకరణ

భద్రాచలం, మే 23: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు శుక్రవారం సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపజేశారు. కల్యాణ మూర్తులకు బేడా మండపంలో నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ జంటలకు శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## ఇంటర్ ర్యాంకర్‌ను అభినందించిన మంత్రి పొంగులేటి

హాసినిని అభినందిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

లక్ష్మీదేవిపల్లి, మే 23: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో కొత్తగూడెం కృష్ణవేణి కళాశాలకు చెందిన విద్యార్థిని కే.హాసిని వెయ్యి మార్కులకు గాను 996 మార్కులు సాధించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హాసినిని అభినందించారు. జీవితంలో పై స్థాయిలో ఉండేటట్టు కృషి చేసి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా మలచుకోవాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ మాచవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఆలయ పునఃనిర్మాణానికి ఆర్థిక సాయం

పాకాల దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

భద్రాచలం, మే 23: భద్రాచలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి ఐటీసీ ప్రముఖ కాం ట్రాక్టర్ పాకాల దుర్గా ప్రసాద్ రూ.1,0,1116 విరాళాన్ని ఆలయ కమిటీకి శుక్రవారం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా పాకాల దంపతులను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు పాకాల దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు.

## జేఈఈ మెయిన్స్‌లో 'లిటిల్ ఫ్లవర్స్' ప్రతిభ

విద్యార్థిని శ్రీభాగ్యను అభినందిస్తున్న డైరెక్టర్

భద్రాచలం, మే 23: జేఈఈ మెయిన్స్ బీ–ఆర్క్‌లో లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థిని ముత్యాల శ్రీభాగ్య 513వ ర్యాంక్ సాధించింది. ఆమెను లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి రమేష్‌బాబు అభినందించి, జ్ఞాపిక అందించారు. ఆమె తండ్రి రాంబాబును శాలువాతో సత్కరించారు.

## వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

బలుగూరు రామిరెడ్డి (ఫైల్)

అశ్వాపురం, మే 23: మండలంలోని సీతారాంపురం గ్రామస్తుడు బలుగూరు రామిరెడ్డి గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలకు కుమారుడు బలుగూరు మధు (సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి) అందించారు. విలేకరులతో మధు మాట్లాడుతూ.. మెడికల్ కళాశాల విద్యార్థులకు ఉపయోగపడాలన్న ఆకాంక్షతో తన తండ్రి మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి ఇచ్చినట్లు చెప్పారు. మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు రాజారావు, సోమన్న, రమేష్, సుధాకర్, పిట్టల రవి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

## 17 మంది వాహనదారులకు జరిమానా

కొత్తగూడెం టౌన్, మే 23: మద్యం సేవించి వాహనాలు నడిపిన 17 మందికి జరిమానా విధిస్తూ కొత్తగూడెం స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు శుక్రవారం తీర్పు చెప్పారు. వన్‌టౌన్ ఎస్సై విజయ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒకరిని, ఎస్సై రాకేష్ ఇద్దరిని, అన్నపురెడ్డిపల్లి ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి ఆరుగురిని, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై నరేష్ 8 మందిని బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా వారు మద్యం సేవించినట్లు నిర్ధారణ జరిగింది. వీరిని కోర్టులో హాజరుపర్చగా వారు మద్యం సేవించినట్లు ఒప్పుకోవడంతో జడ్జి వారికి జరిమానా విధించారు.

## భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

లక్ష్మీదేవిపల్లి, మే 23: భార్యపై భర్త మాధవరావు దాడికి పాల్పడి హత్యాయత్నం చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకున్నది. భర్తకు అక్రమ సంబంధం ఉండడంతో భర్త నుంచి వేరుగా వచ్చి స్థానిక అశోక్‌నగర్‌లో ఉన్న తన తల్లి వద్ద లావణ్య ఉంటోంది. గురువారం మధ్యాహ్నం అశోక్‌నగర్‌కు లావణ్య భర్త మాధవరావు వచ్చి కత్తితో దాడికి పాల్పడ్డాడు. అడ్డు వచ్చిన అత్తపై దాడికి దిగాడు. దీంతో రక్తపు మడుగులో పడి ఉన్న లావణ్యను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మాధవరావు పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భద్రాచలం రామాలయానికి కాపీ రైట్ హక్కులు

భద్రాచలం, మే 23: భద్రాలచం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలోని చిత్రాలను కొందరు దుర్వినియోగం చేస్తున్న నేపథ్యంలో.. వీటిపై కాపీ రైట్స్ తీసుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన చేశారు.

## పార్కింగ్ షెడ్లు ప్రారంభం

మణుగూరు టౌన్, మే 23: మణుగూరు పీవీ కాలనీ ఎంసీ క్వార్టర్లలోని కార్మికుల కోసం వాహనాల పార్కింగ్ షెడ్లను సింగరేణి నిర్మించింది. వీటిని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ శుక్రవారం ప్రారంభించారు. అధికారులు శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకట్‌రావు, రమేష్, వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ రోగులకు న్యూట్రిషన్ కిట్లు

దుమ్ముగూడెం, మే 23: మండలంలోని నర్సాపురం పీహెచ్‌సీలో క్షయ రోగులకు న్యూట్రిషన్ కిట్లను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య శుక్రవారం పంపిణీ చేశారు. టీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ప్రసాద్, పీపీఎం సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి, మే 23: మండలంలోని సులానగర్ పీహెచ్‌సీలో క్షయ రోగులకు గ్రాన్యూల్ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన న్యూట్రిషనల్ కిట్లను వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ శుక్రవారం పంపిణీ చేశారు. ఇల్లెందు డివిజనల్ క్షయ యూనిట్ అధికారి శంకర్, సూపర్‌వైజర్ నాగుబండి వెంకటే శ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయాలి

చండ్రుగొండ, మే 23: రైతులందరికీ పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం చండ్రుగొండ రైతు వేదికలో ఏఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. పెద్దిని వేణు (మండల కన్వీనర్), రామడుగు వెంకటాచారి, రాయి రాజా, ఎస్‌కె.నాగుల్‌మీరా, చల్లపల్లి రాజా, ఎస్.అబ్దల్ రహమాన్ పాల్గొన్నారు.

## చెక్కులు పంపిణీ

భద్రాచలం, మే 23: చర్ల, వెంకటాపురం మండలాల్లోని సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ శుక్రవారం భద్రాచలంలోని తన క్యాంప్ కార్యాలయంలో అందించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పినపాక, మే 23: సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం పినపాక రైతు వేదికలో అందించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీవో వెంకటేశ్వరరావు, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆర్ఐ రమేష్ పాల్గొన్నారు.

## సమ్మర్ క్రికెట్ క్యాంప్ ప్రారంభం

భద్రాచలం, మే 23: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భద్రాచలంలో క్రికెట్ వేసవి శిక్షణా శిబిరాన్ని పట్టణ సీఐ మడిపల్లి నాగరాజు శుక్రవారం ప్రారంభించారు. ఎస్సై స్వప్న, కోచ్ సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్లకు సన్మానం

అశ్వాపురం/మణుగూరు టౌన్, మే 23: విధుల్లో చేరిన అశ్వారావుపురం తహసీల్దార్ రాజారావును రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరరావు శుక్రవారం సన్మానించారు. డీలర్లు వెంకటేశ్వర్లు, వినయ్, రజిత, కృష్ణవేణి, భవాని, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. ఎస్